శుద్ధ జలం కనుమరుగు

- అక్రమణల చెరలో పర్చూరు అంబేడ్కర్ నగర్ చెరువు
- వ్యర్థాలతో నిండిన వైనం
- చెత్తాచెదారంతో దుర్వాసన


ఆక్రమణలకు గురైన అంబేడ్కర్ నగర్ చెరువు

పర్చూరు(చినగంజాం):

కమ్మని జలాలతో దాహార్తి తీర్చిన మంచి నీటి చెరువు నేడు దర్గంధంగా.. వ్యాధుల గుంటగా మారింది. . పర్చూరు బొమ్మల సెంటర్ సమీపంలోని అంబేద్కర్ నగర్ చెరువు నేడు ఆక్రమణల చెరలో చిక్కుకుంది. రోడ్డు మార్జిన్‌తో పాటు చెరువును కూడా ఆక్రమించుకొని దుకాణాలను ఏర్పాటు చేసుకోవడమే కాక వ్యర్థాలను చెరువులోకి వదలడంతో చెరువు నిరుపయోగంగా మారింది.

నాడు శుద్ధం.. నేడు అపరిశుభ్రం

ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ చర్చి ఆధీనంలో ఉన్న ఈ చెరువు గతంలో మంచినీటితో నిండి ఉండేది. దీంతో అంబేడ్కర్ నగర్‌లో నివాసమున్న పలు కుటుంబాల వారు తాగునీటి కోసం ఈ చెరువు మీదే ఆధారపడే వారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ కుంట భూమిగా చెరువు రికార్డుల్లో ఉంది. సర్వే నంబర్ 472లోని 1ఎకరా 60 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న అంబేడ్కర్ నగర్ చెరువులో దుకాణాల నుంచి వ్యర్థాలు వచ్చి చేరడంతో దుర్గంధం వస్తోంది. అంబేడ్కర్ నగర్ కాలనీలోకి వెళ్లాలంటే.. ముక్కు మూసుకొని కాలనీలోకి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు మండి పడుతున్నారు. చెరువులోకి వ్యర్థాలు రాకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

దుకాణ యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలి



హోటళ్లు, టీ షాపుల వారి వ్యర్థాలన్నీ చెరువులోకి వదులుతున్నారు. పలు మార్లు దుకాణాల యజమానులకు వ్యర్థాలను చెరువులోకి వదలొద్దని చెప్పినా వినడం లేదు. చెరువులోనికి వ్యర్థాలను వదులుతున్న దుకాణ యజమానులపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

గేరా స్వరాజ్ కుమార్

మంచి నీటి చెరువును బాగు చేయించండి



అంబేడ్కర్ నగర్ చెరువు వ్యర్థాలకు నిలయంగా మారింది. గతంలో ఇది చాలా పెద్ద మంచి నీటి చెరువు. ప్రస్తుతం ఆక్రమమలకు గురై కుంచించుకుపోయింది. ఆక్రమణలు తొలగించి చెరువులోకి వ్యర్థాలు, మురుగు నీరు రాకుండా చెరువును బాగు చేయించాలి.

జింగా వంశీ

క్లుప్తంగా

సస్యరక్షణతో బొప్పాయికి భరోసా


బొప్పాయి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మిరప, బొప్పాయి పంటలో క్షేత్రస్థాయిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన అధికారి హనుమంతనాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఏల్చూరు గ్రామంలో ఉద్యానశాఖ సహకారంతో మిరప, బొప్పాయి పంటలు సాగు చేసే రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మిరప, బొప్పాయి పంటలను పరిశీలించారు. ప్రధానంగా తామర పురుగు, కాయకుళ్లు, పూత రాలడం వంటి సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించారు. హార్టీకల్చర్ కన్సల్టెంట్ విష్ణుమూర్తి, రైతు సేవాకేంద్రం సిబ్బంది గొన సుమంత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అర్జీల విచారణ వేగవంతం చేయాలి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ డి.అర్జున్, వీఆర్వోలున్నారు.

జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో అధ్యాపకుడి ప్రతిభ


అధ్యాపకుడిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సిబ్బంది

అద్దంకి రూరల్: అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న తాటికొండ శ్రీనివాసులు జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చి కాంస్య పతాకాన్ని సాధించారు. ఈనెల 6 నుంచి 8 వరకు రాజస్థాన్‌లోని ఆళ్వార్‌రాజ్ రిషి కళాశాల స్పోర్ట్స్ మైదానంలో జరిగిన 44 వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్ ఓపెన్ చాంపియన్ షిప్ 2025 ఆంధ్రప్రదేశ్ తరపున 10 వేల మీటర్ల పరుగులో పాల్గొని మూడో స్థానంలో నిలిచి కాంస్యపతాకాన్ని సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్, సహచర సిబ్బంది అభినందించారు.


విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

యద్దనపూడి: విద్యుత్‌చౌర్యం చట్టరీత్యా నేరమని బాపట్ల ఏపీసీపీడీసీఎల్ సూపరెంటెండెంట్ ఇంజినీర్ జి. ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లిఖార్జున్‌రావు అద్దంకి ఈఈ ఎస్. మస్తాన్‌రావు ఆధ్వర్యంలో అధికారులు 30 బృందాలుగా ఏర్పడి 1724 గృహ సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో 43 సర్వీసుల మీద రూ.1,23 వేల పెనాల్టీలు విధించారు. మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పీఎం సూర్యఘర్ పథకం వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఈ దాడుల్లో ఏఈ పి. సురేష్‌బాబు, ఆయా గ్రామాల లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

గుర్తింపు నంబరుతో రైతు కార్డులు

మేదరమెట్ల: భూమి ఉన్న ప్రతి రైతూ ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక గుర్తింపు కలిగిన కార్డులను పొందాలని ఏఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రైతులు ఏవో కార్యాలయానికి తమ పాస్ బుక్, ఆధార్‌కార్డు, ఆధార్ నంబర్ లింక్ అయిన ఫోన్‌తో వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇప్పటికే మండలంలో 1000 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రత్యేక గుర్తింపు నంబరును పొందారని తెలియజేశారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు


స్వర్ణలో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ వెంకట్రావు

స్వర్ణ (కారంచేడు): ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ వి. వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని స్వర్ణ గ్రామంలో వాహన తనిఖీలు చేప్టారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి, వేగంగా ప్రయాణించినా.. వాహన పత్రాలు లేకుండా ఉన్నా చర్యలు తప్పవన్నారు. ద్విచక్రవాహనదారులు కూడా తప్పకుండా హెల్మెట్ ధరించాలని.. అన్ని పత్రాలు వెంట తెచ్చుకోవాలన్నారు.

వివాదాస్పద భూమి పరిశీలన


నూజిల్లపల్లి వివాదాస్పద భూ సమస్య పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

జె.పంగులూరు: మండలంలోని నూజిళ్ళపల్లి గ్రామంలో ఉన్న వివాదాస్పద భూములను గురువారం చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు పరిశీలించారు. గ్రామానికి చెందిన మద్దినేని వెంకటేశ్వరరావు, మద్దినేని హనుమంతురావు మధ్య గత కొంత కాలంగా భూ సమస్య ఉంది. ఇటీవల కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇందుకు సంబంధించి ఫిర్యాదు అందింది. ఈ విషయమై చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు నూజిల్లపల్లి గ్రామానికి వచ్చారు. ఇరుపక్షాలకు చెందిన రైతులను రెవెన్యూ సిబ్బంది పిలిపించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్యను త్వరగా పరష్కరించాలని, అందుకు రైతులు కూడా సహకరించాలని చంద్రశేఖర్ నాయుడు కోరారు. అనంతరం మండల పరిధిలోని బైటమంజులూరు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవక తవకలు లేకుండా సర్వే సజావుగా సాగాలన్నారు. ఎప్పటికప్పుడు రైతులకు అందుబాలు ఉంచుతూ వారి సమక్షంలో సర్వే జరిగే విధంగా చూసుకోవాలన్నారు. తహసీల్దార్ పి. సింగారావు, మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో పరశురామిరెడ్డి, డీఐ శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్ నాగార్జునరావు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు


ముప్పవరం రేషన్ షాపును పరిశీలించిన రెవెన్యూ సిబ్బంది

జె.పంగులూరు: రేషన్ షాపులకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందుబాలో ఉండాలని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల తహసీల్దార్ పి. సింగారావు అన్నారు. గురువారం ముప్పవరంలో రెండు రేషన్ షాపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ షాపులో ఉన్న రేషన్ స్టాకులకు, రికార్డులను పరిశీలించారు. స్టాక్ వివరాలను అటు ప్రజలకు ఇటు అధికారులకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. అక్రమాలకు పాల్పడకుండా నెలనెలా రేషన్‌ను లబ్ధిదారులకు అందే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ గీతా రాణి, ఆర్ఐ శ్వేత, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యాప్రదాత వెంకటేశ్వర రెడ్డి


మోటివేషనల్ స్పీకర్స్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: పట్టణంలోని విఠల్‌నగర్‌లో ఆనాడు విద్యావ్యాప్తికి ఆరె వెంకటేశ్వరరెడ్డి చేసిన కృషి అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆరె రాఘవరెడ్డి మెమోరియల్ ఎయిడెడ్ స్కూల్ వ్యవస్థాపకులు ఆరె వెంకటేశ్వరరెడ్డి 15వ వర్ధంతిని గురువారం పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి స్కూల్ కరస్పాండెంట్ ఆరె గిరిధర గోపాలకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మోటివేషనల్ స్పీకర్స్ కొల్లా శ్రీనివాసరావు, బి.సాంబశివరావు మాట్లాడారు. ఆరె వెంకటేశ్వర రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. రెడ్డి జనసేన సంఘం గౌరవ అధ్యక్షుడు భవనం భద్రిరెడ్డి, అధ్యక్షుడు అనిల్ కుమార్‌రెడ్డి, సెక్రటరీ బందలపాటి జయభారత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, శ్రీగౌతమి విద్యాసంస్థల అధినేత ఎం.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కీర్తి వెంకట్రావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా రీసర్వే నిర్వహించాలి


రీసర్వే వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ గ్లోరియా

యద్దనపూడి: రైతులంతా రీసర్వేకు హాజరయ్యేలా తప్పనిసరిగా నోటీసులు జారీ చేసి, తప్పులు లేకుండా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని బాపట్ల ఆర్డీఓ పి. గ్లోరియా సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని పూనూరులో జరుగుతున్న రీసర్వేను క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయంలో రీసర్వే టీం సభ్యులతో జరిగిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ, దేవాదాయశాఖలకు సంబంధించిన భూముల విషయంలో ఆయా శాఖల అధికారులకు సమాచారం అందజేసి నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ భూములను, చెరువు భూములను ఆక్రమించుకొని సాగుచేస్తే వారి వివరాలను నమోదు చేయవద్దని సూచించారు. తల్లిదండ్రుల నుంచి సక్రమించిన భూములకు వారి కుమారులకు హక్కులు ఉంటే రికార్డులో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ పరమైన సమస్యలు ఏమైనా ఉంటే తక్షణమే పరిష్కారం చేయాలన్నారు. ఎక్కడా చెడ్డపేరు లేకుండా సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, తహసీల్దారు రవికుమార్, మండల రీసర్వే డీటీ విష్ణు, డీటీ మస్తాన్‌రావు, వీఆర్వో వసంతరావు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డుగా తోపుడు బండ్లు ఉంచితే చర్యలు


పర్చూరులో మాట్లాడుతున్న ఎస్‌ఐ మాల్యాద్రి

పర్చూరు(చినగంజాం): పర్చూరు బొమ్మల సెంటర్‌లో రోడ్డుపై వాహనాలకు అడ్డంగా తోపుడు బండ్లు ఉంచితే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ మాల్యాద్రి హెచ్చరించారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో చిరువ్యాపారులు.. తోపుడు బండ్లు పెట్టుకోవడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. రోడ్లపై ప్రజా రవాణాకు అడ్డంగా ఉన్న వాహనాలు, తోపుడు బండ్లను ఆయన తొలగించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలో జెడ్పీ జనరల్ నిధుల ద్వారా వచ్చిన అభివృద్ధి పనులను గురువారం డిప్యూటీ సీఈవో పి.బాలమ్మ పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఎంపీడీఓ రాజ్యలక్ష్మికి సూచనలు, సలహాలు అందించారు. ఎంఈవో పున్నయ్య, ఏఈ, పంచాయితీ కార్యదర్శి దుర్గ పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది మృతి


దూళిపాళ్ల శ్రీనివాసరావు (ఫైల్)

చీరాల రూరల్: చీరాల కోర్టులో దీర్ఘకాలంగా న్యాయవాది వృత్తిలో కొనసాగుతూ న్యాయసేవలందించిన ధూళిపాళ్ల శ్రీనివాసరావు (60) చీరాల ఉడ్ నగర్‌లోని ఆయన స్వగృహంలో గురువారం మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్య కారణంతో బాధపడుతున్నారు. సీనియర్ సివిల్ న్యాయవాదిగా పేరుగాంచిన శ్రీనివాసరావు ఎంతో మందికి న్యాయ సహాయం అందించి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. చీరాలతో పాటు అనేక ప్రాంతాల్లోని కోర్టుల్లో సేవలు కొనసాగించారు. చీరాల కోర్టులో ఏజీపీగా విధులు నిర్వర్తించడమే కాకుండా బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సేవలందించారు. బార్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా పని చేసిన కాలంలో అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేశారు. ఆయనకు భార్య నాగలక్ష్మి ఉన్నారు. న్యాయవాదులు.. శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులర్పించారు. అతని స్వగ్రామమైన కారంచేడు మండలం కుంకలమర్రులో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కావాలి


మామిడి మొక్క నాటుతున్న స్రవంతి

వేటపాలెం: పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి తద్వారా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ ప్రాజెక్టులను చేపట్టాడానికి సాధికారత కల్పిస్తాయని నేషనల్ గ్రీన్ కోర్ సంచాలకులు పి. స్రవంతి పేర్కొన్నారు. గురువారం బాపట్ల జిల్లా పర్యటలో భాగంగా కొత్తపేటలోని బీఆర్‌కే పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరివర్తను ప్రోత్సహించడానికి ఎకో క్లబ్ మంచి వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ స్థిరంగా జీవించడం నేర్చుకోవడం ప్రాముఖ్యతను తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర మూడో శనివారం కార్యక్రమాన్ని పాఠశాల్లో ఎకో క్లబ్‌ల ఆధ్వర్యంలో చేపట్టాని సూచించారు. కాలుష్య రహిత జీవనశైలిని ప్రోత్సహించాలని సూచించారు. ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని తగ్గించడానికి, బహిరంగ ప్రదేశాల్లో వాటిని విసిరేయకుండా చూడాలన్నారు. అనంతరం స్కూల్ ప్రాంగణంలో మామిడి మొక్కలు నాటారు. జిల్లా నేషనల్ గ్రీన్ కోఆర్డినేటర్ పవని భాను చంద్రమూర్తి, ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి శవనం చంద్రారెడ్డి ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

లైంగిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మార్టూరు: లైంగిక వ్యాధులు.. తద్వారా ఎదురయ్యే పరిణామాలు, కుటుంబ నియంత్రణ పద్ధతులు తదితర అంశాల గురించి యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కె. దుర్గ అన్నారు. అంతర్జాతీయ కండోమ్ దినోత్సవం సందర్భంగా మార్టూరులోని వైఎస్సార్ అండ్ ఏయం డిగ్రీ కళాశాల విద్యార్థులతో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. అవాంఛిత మరియు అసహజ లైంగిక శృంగారం వలన ఎయిడ్స్ వ్యాధి ప్రబలుతుందని వాటి నిరోధానికి కండోం అవసరం అన్నారు. దీని ఆవశ్యకతను యువతకు తెలియజేయడం కోసమే ఫిబ్రవరి 14వ తేదీ వలెంటెన్స్ డేకి ఒకరోజు ముందు ఫిబ్రవరి 13వ తేదీని అంతర్జాతీయ కండోమ్ దినోత్సవంగా ప్రకటించినట్లు తెలిపారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ వారి నివేదిక ప్రకారం గత పది సంవత్సరాల కాలంలో దేశంలో 17 లక్షల మందికి పైగా హెచ్ఐవీ సోకిందని ఎయిడ్స్ వ్యాధికి పూర్తిగా పోలేదని నివారణ మాత్రమే మార్గమన్నారు. బాపట్ల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ.. దిశ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీరగంధం శ్రీనివాసరావు ప్రిన్సిపాల్ కె. అంకమ్మ, అధ్యాపకులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు సంస్థ ప్రతినిధులు సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

నల్ల బర్లీ కొనుగోలు చేయాలి


వినతి పత్రం అందజేస్తున్న రైతులు

జె.పంగులూరు: నల్ల బర్లీ పొగాకు కేంద్రాలను ఏర్పాటు చేసి తక్షణమే కొనుగోలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో పంగులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి డి. సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలలో సుమారు 90 వేల ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశారన్నారు. ఇందులో తెల్ల బర్లీ, నల్లబర్లీ రకాలున్నాయని, ప్రస్తుతం తెల్లబర్లీ పొగాకు ఈ ప్రాంతంలో జీపీఐ అనే ప్రయివేటు కంపెనీ కొనుగోలు చేస్తోందని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా మిర్చి పంట దెబ్బతిని పోయిందని, సరిగా దిగుబడులు రాక, గిట్టుబాటు ధరలు అందక రైతులు ఈ సంవత్సరం ఎక్కువ గా బర్లీ పొగాకు సాగు చేశారన్నారు. అయితే రైతు బలహీనత గమనించిన ప్రయివేటు పొగాకు కంపెనీలు ఈ సంవత్సరం ధరలు బాగా తగ్గించి పొగాకును కొనుగోలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు ధర లేక, దిగుబడులు సరిగా రాక రైతులు నష్టాల పాలౌతున్నారన్నారు. ఇది అదునుగా చేసుకొని ఈ రంగం లోకి దళారులు వచ్చారన్నారు. కంపెనీలు పొగాకు కొనుగోలు చేసుకోక పోవడంతో దళారీలు రైతుల వద్దకు వచ్చి క్వింటా రూ. 3 వేల నుంచి రూ. 4 వేలకి అడుతున్నారని, దీనితో రైతులకు ఏమి చేయాలో పాలు పోవడం లేదని తెలిపారు. ఒక వైపు బర్లీ పొగాకు వేయమని చెప్పి బాండ్లు ఇచ్చి.. ప్రోత్సహించిన ప్రయివేటు కంపెనీలు నేడు నల్ల బర్లీ కొనక పోవడం, తెల్ల బర్లీని తక్కువ ధరకు కొనుగోలు చేయడం రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారన్నారు. సాగులో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారని, అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి, పెట్టుబడులకు పెట్టి సాగు చేశారన్నారు. పొగాకు రైతులకు గిటుబాటు ధర అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

జ్యోతయ్య సేవలు మరువలేనివి


జ్యోతయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సభ్యులు

అద్దంకి రూరల్: అద్దంకి సంగీత సాహిత్య కళా సేవా రంగాల ఆధ్వర్యంలో గురువారం జ్యోతయ్య దశదిన కార్యక్రమాల సందర్భంగా ఆయన స్వగృహం వద్ద సంస్మరణ సభ నిర్వహించారు. సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు మాట్లాడుతూ పంతంగి జ్యోతయ్య అందించిన సేవలతో పేదల హృదయాల్లో నిలిచి పోతారన్నారు. పట్టణంలోని నర్రావారిపాలెం శ్మశాన వాటికకు ఆయన సేవలకు గుర్తుగా జ్యోతయ్య శ్మశాన వాటికగా పేరు పెట్టాలని సూచించారు. అనంతరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యోగా గురువు శేషారెడ్డి, ఎస్‌బీఐ రిటైర్డు ఉద్యోగి తాళ్లూరి వెంకట సుబ్బయ్య, నందమూరి కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మలాది శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకరరావు, మేదరమెట్ల భద్రయ్య, ఎస్‌కే రఫీ, కావూరి రఘుచంద్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, మస్తాన్‌రావు, పంతంగి ఆంజనేయులు, చిన్ని మురళీకృష్ణ, అద్దంకి లెవీ ప్రసాద్, అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కొడవలివారిపాలెం(కారంచేడు): చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం అవసరమని ఐసీడీఎస్ ఇంకొల్లు సెక్టార్ సీడీపీఓ తిరుమలశెట్టి ఝాన్సీ అన్నారు. మండలంలోని కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కారంచేడు, స్వర్ణ సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం నుంచి శనివారం వరకు జరిగే పోషణ-బీ, పఢాయి-బీ అనే కార్యక్రమ నిర్వహణపై శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. అలాంటి ఆహారం ఎలా తయారు చేసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఏ. ఉమామహేశ్వరరావు, స్వర్ణ, కారంచేడు సెక్టార్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్లికురవ: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే 3 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులకు నైపుణ్యాలతో కూడిన ఆట పాటలతో విద్యను అందించాలని ఐసీడీఎస్ సంతమాగులూరు సీడీపీవో దివి సుధ అన్నారు. గురువారం బల్లికురవ మండలంలోని వి. కొప్పరపాడు సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులో పోషణ్‌బీ పడాయిబీపై శిక్షణ నిర్వహించారు. చిన్నారుల పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు అవసరమైన మెటీరియల్ ఎప్పటికప్పుడు తయారు చేసుకోవాలన్నారు. చిన్నారులకు ఆధారిత విద్యలో భాగంగా 5 రకాలైన అభివృద్ధిని మెరుగుపరచటం గురించి సీడీపీఓ వివరించారు. టెలీఫిలిం ద్వారా శిక్షణ అందించారు. సూపర్‌వైజర్లు సలోమీ, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): చిన్నారుల చదువు, పోషణలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. గురువారం పర్చూరు వైఆర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని పర్చూరు, యద్దనపూడి, మార్టూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. మూడు సంవత్సరాల్లోపు చిన్నారులకు పోషణ, మూడు నుంచి ఆరు ఏళ్ళ లోపు చిన్నారులకు చదువు-పోషణలపై శిక్షణ తరగతులు జరుతున్నాయి. సీడీపీఓ సుభద్ర, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లులో..

మండల కేంద్రమైన ఇంకొల్లులో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ తరగతులను సీడీపీఓ టి. ఝాన్సీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందించిన పోషకాహారం పంపిణీ చేయాలన్నారు. మంచి విద్య, బుద్ధులు చిన్నారులకు నేర్పించాలన్నారు. సూపర్‌వైజర్ వాణిశ్రీ, సుమలత, హెచ్‌ఎం కుర్రా రామారావు పాల్గొన్నారు.

సరదా చదువుతో ఆకట్టుకోవాలి

వేటపాలెం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను సరదా చదువుతో ఆకట్టుకొని విద్య నేర్పించాలని సీడీపీఓ ఉమా పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ సమా వేశం హాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు నిర్వహించ నున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాల్య సంరక్షణ విద్య సేవల పారదర్శకంగా ఉండాలన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ వారి పెరుగుదల కొలతలను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. సూపర్‌వైజర్ పుష్పవల్లి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూజాత అన్నారు. యద్దనపూడిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం పోషణ్ బీ - పడాయి బీ అనే కార్యక్రమంపై అంగన్‌వాడీ సిబ్బందికి మూడురోజుల శిక్షణ నిర్వహించారు. పర్చూరు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దీపాదేవి శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం సూక్ష్మ, స్థూల పోషకాహార లోపాలను నివారించడం అనే అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

16న గణపతి వార్షికోత్సవం


మొదటి వార్షికోత్సవానికి ముస్తాబైన వరసిద్ధి వినాయకుడు

బల్లికురవ: గ్రామంతో పాటు పరిసర గ్రామస్తుల సహకారంతో బల్లికురవలో నిర్మించిన వరసిద్ధినాయకుని మొదటి వార్షికోత్సవం ఈనెల 16 న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచే గణపతికి ప్రత్యేక పూజలు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ ప్రసాదాల పంపిణీ అన్నసంతర్పణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.